
WWW.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

26-12-2025



# క్రైస్తవుల అతి పెద్ద పండుగ క్రిస్మస్



ప్రపంచ క్రైస్తవుల అతి పెద్ద పండుగ క్రిస్మస్. క్రీస్తు పుట్టుక పర్వదినాన్ని పురస్కరించుకుంటూ కిష్టారం అంబేద్కర్ నగర్ రోమన్ క్యాథలిక్(ఆర్.సి.ఎం) చర్చ్ లో విచారణ సహాయక గురువు జార్నేష్ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన నరుకుళ్ళ రాజేశ్వరి, కాంగ్రెస్ నాయకులు నరుకుళ్ళ అప్పారావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



7 లో

## మత్తులో మాతృత్వం

**వైరా బస్టాండ్‌లో కన్నీరు పెట్టించిన దృశ్యం**

అమ్మ అంటే ఆప్యాయత.. అమ్మ అంటే రక్షణ.. ఆపదలో ఉన్న బిడ్డకు అమ్మే ధైర్యం. కానీ, వ్యసనం కళ్లు కప్పితే ఆ కన్నతల్లే బిడ్డలకు శాపంగా మారుతుందని నిరూపించింది వైరాలో జరిగిన ఒక దారుణ ఘటన. కన్నబిడ్డల ఆకలి కేకలు, వారి భయం ఆ తల్లికి వినిపించలేదు.. కనిపించలేదు.



9 లో

## 'ఎర్ర' కోట కూలింది

**పోలీసుల మెరుపు దాడిలో గణేష్ హతం!**

దండకారణ్యం మరోసారి తూటాల గర్జనతో వణికిపోయింది. దశాబ్దాలుగా పోలీసు యంత్రాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తూ, గెరిల్లా యుద్ధతంత్రంతో అడవిని శాసించిన మావోయిస్టు అగ్రనేత పాకా హనుమంతు అలియాస్ గణేష్ ఉయికే ప్రస్థానం ముగిసింది.

# అటల్ జీ ఆశయాల బాటలో నవ భారతం

## భారత రాజకీయ యవనికపై అజాతశత్రువు అటల్

- కార్యకర్తలే పార్టీకి ప్రాణం.. అటల్ స్ఫూర్తితో ప్రజాక్షేత్రంలోకి వెళ్లండి
- భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి



ఖమ్మం, మహా

భారత రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నడుం బిగించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటకతమిళనాడు రాష్ట్రాల కోఇన్చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ఖమ్మం జిల్లాలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన భారీ కార్యకర్తల సమావేశంతో పాటు, జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

7 లో

## ఖమ్మంలో ఎన్ఐఏ ప్రకంపనలు



5 లో

ఖమ్మం జిల్లా కేంద్రంలో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు మెరుపు దాడులు నిర్వహించడం కలకలం రేపింది. ముఖ్యంగా విద్యా రంగానికి చెందిన కొందరు కీలక వ్యక్తుల నివాసాల్లో ఈ సోదాలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు అందిన ఫిర్యాదుల మేరకు, ఉగ్రవాద లేదా నిషేధిత సంస్థల సంబంధాలపై ఆరా తీసేందుకు ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది

## యువతకు ఉచిత స్కిల్ ట్రైనింగ్



5 లో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎల్ ఎస్ సి లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్ రీడింగ్టన్ ఫౌండేషన్ సహకారంతో జాబ్ గ్యారెంటీతో కూడిన ఉచిత స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు.

## జిల్లాలో 17 కొత్త సొసైటీలు..?



3 లో

తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక సహకార పరపతి సంఘాలను విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నూతన సొసైటీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులు రైతు సభ్యత్వాల జనాభా ప్రతిపాధికన కొత్త సొసైటీల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేసింది.

# క్రైస్తవుల అతి పెద్ద పండుగ క్రిస్మస్

## క్రిస్టమస్ సందర్భంగా నూతన సర్పంచ్‌కి సన్మానం



**సత్తుపల్లి,మహా:** ప్రపంచ క్రైస్తవుల అతి పెద్ద పండుగ క్రిస్మస్. క్రీస్తు పుట్టుక పర్వదినాన్ని పురస్కరించుకుంటూ కిష్టారం అంబేద్కర్ నగర్ రోమన్ క్యాథలిక్(ఆర్.సి.ఎం) చర్చ్ లో విచారణ సహాయక గురువు జార్నేష్ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన నరుకుళ్ళ రాజేశ్వరి, కాంగ్రెస్ నాయకులు నరుకుళ్ళ అప్పారావు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోమన్ క్యాథలిక్ సంఘ క్రైస్తవులు సర్పంచ్ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ రాజేశ్వరి అప్పారావు దంపతులు క్రిస్మస్ కేక్ కట్ చేసి గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు పుట్టుక సర్వమానివాళికి స్ఫూర్తిదాయకమని, దేవాతి దేవుడైన ఏసుక్రీస్తు పశువుల పాకలో పుట్టి తనను తాను తగ్గించుకొని సమస్త మానవాళి కొరకు సిలువలో ప్రాణాన్ని పణంగా పెట్టి మానవులందరికీ రక్షకుడిగా నిలిచారని, క్రీస్తును స్మరిస్తూ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని గ్రామ సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి వెంకటేశ్వరరావు, వాడపల్లి కోటేశ్వరరావు, వాడపల్లి సుందర్ రావు, పాలకుర్తి పుల్లయ్య, పాగా పాపయ్య, పాలకుర్తి ప్రవీణ్, తాళ్ల నాగేంద్ర, మారోజు వరలక్ష్మి, వాడపల్లి నాగవేణి అధిక సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా వాజపేయి జయంతి



**బూర్గంపహాడ్ మహా:** మండల పరిధిలోని సారపాక గ్రామ ప్రధాన కూడలిలో బూర్గంపాడు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని, భారతరత్న శ్రీ అటల్ బీహారీ వాజపేయి 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందిముందుగా, వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయనకు ఘనంగా స్మరణ చేశారు. ఈ సందర్భంగా వాజపేయి జీవితం, సేవలు, దేశాభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషిని స్మరించుకున్నారు.బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ గుగులోత్ బాలు నాయక్ మాట్లాడుతూ -"రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచిన మహానేత అటల్ జీ, భావితరాలకు సువర్ణ బాటలు వేసిన దార్శనికుడు. ఆధునిక భారతదేశానికి గట్టి పునాదులు వేసిన మహాత్ముడు. తన ముందుచూపుతో దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల అభివృద్ధికి బాటలు వేసిన గొప్ప నాయకుడు. పోఖ్రాన్ అణు పరీక్షలతో ప్రపంచానికి భారత శక్తిని చాటిచెప్పిన ధైర్యశాలి. భరతమాత సేవకై తన జీవితాన్ని అంకితం చేసిన మహాకవి, తన ప్రసంగాలతో కోట్లాది మందిని మంత్రముగ్ధులను చేసిన మహావక్త, అజాతశత్రువుగా పేరు గాంచిన ఆదర్శ నేత. అటువంటి మహానేత ఆశయాలు నేటి యువతకు దిక్సూచి. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ సేవలో ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు.అటల్ జీ ప్రధానిగా ఉన్న కాలంలో గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, రహదారులు, సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, రాజకీయాల్లో విలువలు, సమన్వయం, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలోబిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బిజ్జం శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిల్ నెంబర్ చుక్కపల్లి బాలాజీ గనిపోయిన శ్రీనివాస్ కోడబోయిన రవి పటేల్ తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**నేలకొండపల్లి, మహా:** మండలం లోని వివిధ గ్రామాలలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని పలు చర్చిలలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహిం చారు. మండలంలోని కోనాయి గూడెం గ్రామంలోని డేవిడ్రాజ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, వార్డు సభ్యులు చెరుకుపల్లి వెంకటమ్మలు కేక్ కట్ చేసి వేడుకల ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ వడ్ల మూడి వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ వడ్లమూడి నర్సయ్య, చెరుకుపల్లి రాజేష్, చెరుకుల్లి ఉపేందర్, కస్తాల నాగరాజు, తదిత రులు పాల్గొన్నారు. బైరవునిపల్లి, మంగాపు రంతండా, నేలకొండపల్లి, సుర్దేపల్లి, రాజేశ్వ రపురం తదితర గ్రామా లలోని చర్చిలలో వేడుకలు ఘనంగా నిర్వహిం చారు.

## దేశంలో అనేక సాంకేతిక విప్లవం సాధించిన వాజపేయి

**నేలకొండపల్లి, డిసెంబర్ 25 మహా:** దేశంలో ప్రధానమంత్రి గా అనేక సాంకేతిక విప్లవాలు సాధించిన ఘనత ఒక్క వాజ్పేయ్ కు దక్కుతుందని బీజెపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం భారత మాజీ ప్రధాని వాజ్పేయ్ జయంతి ని ఘనంగా నిర్వహించారు.. తొలుత ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు ను పంపిణీ చేశారు. పార్టీ సినియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...అధికారంలో చేతిలో ఉన్నప్పటీకీ వినయం వీడని గొప్ప నాయకుడు అన్నారు. దేశంలో అనేక సంక్షేమ పధకాలు ప్రవేశపెట్టిన ఘనత అయన కు దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, ఉపాధ్యాక్షుడు పురాణం దివాకర్. కొండా హర్షవరన్, గెల్లా చక్రపాణి, కందరబోయిన గోపి, ఏలిగేటి గిరి, దేశబోయిన వేణుబాబు, జోగుపర్తి నారాయణ, బ్రహ్మావరపు ఉదయ్, రాజపుత్ర సాయి, బీ. నాగరాజు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



Follow: @ANNTELUGU
26-12-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# 17 కొత్త సొసైటీలు ?




## టి.పాలెంలో నాలుగు, కూసుమంచి లో రెండు మరో కొత్త సొసైటీలను ఏర్పాటు అయ్యే అవకాశం

## అసెంబ్లీ సమావేశాల తరువాత జీవో విడుదల.. ప్రభుత్వానికి ప్రతిపాధనలు చేసిన అధికారులు

**ఖమ్మం ప్రతినిధి/ కూసుమంచి మహా:** తెలంగాణ రాష్ట్రంలో ప్రాథమిక సహకార పరపతి సంఘాలను విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నూతన సొసైటీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే సంబంధిత అధికారులు రైతు సభ్యత్వాల జనాభా ప్రతిపాధికన కొత్త సొసైటీల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేసింది. అందుకు సంబంధించిన ఫైల్ ను సిద్దం చేసిన అధికారులు సీఎం రేవంత్ రెడికి ప్రతిపాధన చేసినట్లు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై గత రెండు రోజుల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించగా మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. దీంతో అతి కొద్ది రోజుల్లోనే మండల స్థాయిలో నూతన ప్రాథమిక సహోకర పరపతి సంఘాలు పరిగే అవకాశం ఉంది. అదే జరిగితే జిల్లా వ్యాప్తంగా కొత్త సొసైటీలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది.

### సొసైటీ సేవలను పొందలేకపోతున్న రైతన్నలు

ప్రాథమిక సహాయక పరపతి సంఘాలు రైతులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఒక్కొక్క సొసైటీకీ సుమారు 20కిలోమీటర్లకు దూరంగా గ్రామ పంచాయతీలు ఉండటంతో రైతులు ఆ సంఘం సేవలను అందుకోలేకపోతున్నారు. ఎరువులు, విత్తనాలు, సబ్సిడీ లాంటి అనేక అవసరాలను దూరం ప్రాంతాల రైతులు అందుకోలేక పోతున్నారు. రైతులు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం సంచలన నిర్ణయం తీసుకోబోతుంది. సహకార సంఘాలు రైతులకు మరింత అందుబాటులో, దగ్గర ప్రాంతంలో ఉండాలనే ఆలోచన ప్రభుత్వం సహకార సంఘాలను విస్తరించాలని నిర్ణయించింది. అతి కొద్ది రోజుల్లోనే సొసైటీలను ఏర్పాటు చేయాలనే దృడ సంకల్పం ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది.

### జిల్లాలో 17 కొత్త సొసైటీలు

జిల్లా వ్యాప్తంగా 580 పంచాయతీ లు ఉండగా, మొత్తం 76 సంఘాలు ఉన్నాయి. అందులో 11 సంఘాలు అద్భుతమైన లాభాలను అందిస్తున్నాయి. మిగిలిన సంఘాలు అరకొరగా లాభాలు వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం లాభాలు వచ్చే సంఘాలను విస్తరించాలని నిర్ణయించారు. అందుకే జిల్లా వ్యాప్తంగా మరో 17సంఘాలను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### కొత్తగా ఏర్పాటైయ్యే సంఘాలు ఇవ్వే..

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 9మండలాల్లో మొత్తం 17 కొత్త సొసైటీలను ఏర్పాటు చేసేందు ప్రభుత్వం నివేదికను తయారు చేసింది. తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు, కాకరవాయి, జల్లేపల్లి, పిండిప్రోలు, కూసుమంచి మండలంలోని పెరికసింగారం, పాలేరు గ్రామ పంచాయతీలను నూతన సొసైటీలుగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే చింతకాని మండలంలోని నాగిలిగొండ, పాతర్లపాడు, మధిర మండలంలోని సిరిపురం, మడుపల్లి, ముదిగొండ మండలంలోని బాణాపురం వనం వారి కిష్టాపురం సత్తుపల్లి మండలంలోని బుగ్గపాడు, కల్లూరు మండలంలోని ముచ్చవరం, పేనుబల్లి మండలంలోని కారాయి గూడెం, కుప్పెనకుంట్ల, వేంసూరు మండలంలోని ఆడచర్లపాడు, పేర్లతో కొత్త సొసైటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాధికారులు నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు.

### కూసుమంచి మండలంలో..

కూసుమంచి మండలంలో మొత్తం 41 పంచాయతీలు ఉండగా అందులో మూడు ప్రాథమిక సహోకార సంఘాలు మాత్రమే ఉన్నాయి. కల్లూరిగూడెం సొసైటీ కిందా 34 పంచాయతీలు ఉండగా, 45 గ్రామాలు ఉన్నాయి. అలాగే చేగొమ్మ సొసైటీ కిందా ఐదు పంచాయతీలు, జక్కేపల్లి సొసైటీ కిందా రెండు పంచాయతీలు ఉన్నాయి. కల్లూరిగూడెం సొసైటీ పరిధిలో పెరికసింగారం, రాజుపేట, రాజుపేట బజార్, ఈశ్వరమాదారం, భగత్ వీడు, మంగళి తండా, నాయకన్ గూడెం, పాలేరు, జుజ్జులరావుపేట, మల్లాయిగూడెం, గోరిలపాడుతండా, గుర్వాయి గూడెం, నర్సింహులగూడెం, కొత్తూరు, ఎర్రగడ్డతండా, బోడియతండా, గైగొళ్లపల్లి, లాల్ సింగ్ తండా, సంధ్యతండా, తుర్కగూడెం, గంగబండతండా, లింగారంతండా, అజ్మీరహీరామాన్ తండా, గట్టుసింగారం, మల్లేపల్లి, లోక్యతండా, కోక్యతండా, నేలపట్ల, ఆగ్రహారం, కూసుమంచి గ్రామాలు ఉన్నాయి. ఆ పంచాయతీలన్నింటికి మండల కేంద్రంలో కార్యాలయం ఉంది. పెరికసింగారం, రాజుపేట, ఈశ్వరమాదారం, గైగొళ్లపల్లి, సంధ్యతండా లాంటి పంచాయతీలు మండల కేంద్రానికి సుమారు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో సొసైటీ వారు రైతుల కోసం అందించే ఎరువులు, విత్తనాలు, సొసైటీకి సంబంధించిన అనేక సౌకర్యాలను రైతులు పొందే అవకాశం లేకుండా ఉంది. కేవలం కూసుమంచి సమీప ప్రాంతాల రైతులు మాత్రమే సొసైటీ నుంచి వచ్చే సౌకర్యాలను పొందుతున్నారు. దూరప్రాంతాల రైతులు ఎరువులు, పెర్టిలేజర్ దుకాణాలను అశ్రయించి నష్టపోతున్నారు. అలాగే చేగొమ్మ సొసైటీ పరిధిలో ముత్యాలగూడెం, చేగొమ్మ, జీళ్ళచెరువు, కేశ్వాపురం, మునిగేపల్లి గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో మునిగేపల్లి గ్రామ పంచాయతీ రైతులకు చేగొమ్మ గ్రామం సుమారు 7 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి సొసైటీ సేవలు అందడం కొంత ఇబ్బందిగా ఉందని రైతులు చెబుతున్నారు.

## సొసైటీలు ఏర్పాటైతే రైతులకు మేలు

**కూసుమంచి మండలంలో ఐదు సొసైటీలు ఏర్పడితే రైతులకు మేలు జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైతులకు అందుబాటులో రెండు కిలోమీటర్ల డిస్టెన్స్ లో సొసైటీ ఆఫీసులు ఉండే అవకాశం ఉంది. దీంతో రైతులు ఎరువులు, విత్తనాలను తీసుకునే అవకాశం కూడా మెరుగ్గా ఉంటాయని రైతులు, రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే సొసైటీ ప్రతినిధులు కూడా పెరిగే అవకాశం ఉండటం, పాలనపరమైన సౌలభ్యం కలిగే అవకాశం ఉందని పలువురు రైతులు భావిస్తున్నారు. కొత్త సొసైటీలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని రైతులు అభిప్రా యపడు తున్నారు. చూద్దాం ప్రభుత్వాధికారులు ప్రభుత్వానికి నివేదించిన కొత్త సొసైటీల ఏర్పాటు ప్రక్రీయ ముందుకు సాగుతుందో..? వెనకడుగు వేస్తుందో..? వేచి చూడాల్సిందే..?**

## కూసుమంచిలో మరో రెండు కొత్త సొసైటీలు

**కూసుమంచిలో మరో రెండు కొత్త సొసైటీలు కూసుమంచిలో మరో రెండు కొత్త సొసైటీలు ఏర్పాటైయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు కల్లూరిగూడెం, జక్కేపల్లి, చేగొమ్మ సొసైటీలు ఉండగా పాలేరు, పెరికసింగారం పేర్లతో మరో రెండు సొసైటీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే సంబంధిత ప్రభుత్వాధికారులు కొత్త పంచాయతీలతో కూడిన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. కల్లూరిగూడెంలో ఉన్న 35 పంచాయతీలను మూడు సొసైటీలుగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు కల్లూరిగూడెం సొసైటీలో ఉన్న జుజ్జులరావుపేట, పెరికసింగారం, గట్టుసింగారం, లింగారంతండా, మల్లాయిగూడెం, మంగళితండా, మల్లేపల్లి, భగత్ వీడు, ఈశ్వరమాదారం, రాజుపేట, రాజుపేట బజార్, గోరిలపాడుతండా, అజ్మీరహీరామాన్ తండా గ్రామ పంచాయతీలను కలిపి పెరికసింగారం సొసైటీగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే పాలేరు, నర్సింహులగూడెం, కొత్తూరు, ఎర్రగడ్డతండా, చౌటపల్లి, బోడియతండా, గైగొళ్లపల్లి, లాల్ సింగ్ తండా, సంధ్యతండా, నాయకన్ గూడెం గ్రామ పంచాయతీలను కలిపి పాలేరు సొసైటీ గా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపించారు. ప్రస్తుతం కల్లూరిగూడెం సొసైటీ ని కూసుమంచి సొసైటీగా నామకరణం చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలుస్తోంది. ఆ సొసైటీ కిందా కూసుమంచి, పోచారం, కిష్టాపురం, తుర్కగూడెం, గుర్వాయిగూడెం, గంగబండతండా, లోక్యతండా, కోక్యతండా, నేలపట్ల, ధర్మతండా, ఆగ్రహారం గ్రామ పంచాయతీలు ఉండనున్నాయి. అలాగే జక్కేపల్లిలో జక్కేపల్లి, జక్కేపల్లి ఎస్సీ కాలనీలో జక్కేపల్లి సొసైటీ, మునిగేపల్లి, జీళ్ళచెరువు, చేగొమ్మ, ముత్యాలగూడెం గ్రామ పంచాయతీలను కలిపి చేగొమ్మ సొసైటీగా ఏర్పాటు చేయనున్నారు.**



## మనసున్న మహారాజు ఏసుబాబు

**బూర్గంపహాడ్ మహా:** మస్జిద్ ఏరియా సుందరయ్య నగర్‌లో విద్యార్థులు, యువకులు క్రికెట్ పై ఉన్న అపారమైన ప్రేమతో ఆడుకుంటూ ఉన్న దృశ్యాన్ని గమనించిన యేసు బాబు వారి లోపాన్ని గుండెతో గుర్తించారు.ఆటపై ఉన్న ఉత్సాహానికి సరైన బ్యాటు లేకపోవడం చూసి, క్షణం ఆలస్యం చేయకుండా క్రికెట్ బ్యాట్, బాల్‌ను బహుకరించారు.ఆ చిన్న సహాయం వారికి పెద్ద ఆనందంగా, కొత్త ఆశగా మారింది. కళ్లలో మెరుపు, ముఖాల్లో చిరునవ్వు, హృదయాల్లో కృతజ్ఞతతో విద్యార్థులు, యువకులు అందరూ కలిసి యేసు బాబు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఇది కేవలం బ్యాట్, బాల్ బహుకరణ కాదు. యువత కలలకు ఇచ్చిన ప్రోత్సాహం ఆటపై ప్రేమకు ఇచ్చిన గౌరవం మనిషితనానికి నిలువెత్తు నిదర్శనంఇలాంటి మనసున్న నాయకులు ఉన్నంతకాలం మన సమాజం మరింత వెలుగులోకి వస్తుందనే నమ్మకం కలుగుతోంది.<

## పెండింగ్ రేషన్ కార్డులను వెంటనే అందించాలి

### మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి వినతి పత్రం




**నేలకొండపల్లి, మహా:** పెండింగ్ లో ఉన్న రేషన్ కార్డులను వెంటనే అందించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు కోరారు. కోదాడ లో గురువారం జరిగిన కార్యక్రమంలో కృష్ణారావు ఆధ్వర్యంలో మంత్రి ని కలిసి వివిధ సమస్యల పై వినతి పత్రం అందించారు. కొంత మంది కి రేషన్ కార్డులు మంజూరైనప్పటికీ రేషన్ ఇవ్వటం లేదని ఫిర్యాదు చేశారు. గ్రామాలలో కార్డులకు ఈకేవైసీ లేకపోవటం వలన కార్డుదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని... వెంటనే అధికారులే ఈకేవైసీ ని చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు కూడ అందించేందుకు చర్యలు తీసుకోవాలని 'కోరారు. ఆయన తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వీధి దీపాలు ఏర్పాటు


## సర్పంచ్ కొట్టెం శోభారాణి



**పినపాక,మహా:** మండలం లోని అమరారం పంచాయతీ కొత్తూరు కాలనీలో ఆమరారం గ్రామపంచాయతీ సర్పంచ్ కొట్టెం శోభా రాణి ఆధ్వర్యంలో నూతన విద్యుత్ దీపాలు గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ కొట్టెం శోభా రాణి మాట్లాడుతూ... కొన్ని వీధి విద్యుత్ దీపాలు మరమ్మతులకు గురవడంతో గ్రామ పంచాయతీలో ప్రజలు రాత్రి సమయంలో వెలుతురు లేక ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మరమ్మతులకు గురైన వాటి స్థానంలో నూతన వీధి విద్యుత్ దీపాలు ఏర్పాటు చెయ్యడం జరిగింది అని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలక సభ్యులు, అమరారం పంచాయతీలో కొత్తూరు కాలనీ ఉప సర్పంచ్. సో యం సరస్వతి. వార్డు సభ్యులు బిజ్జ శ్రీలత,పంచాయతీ కార్యదర్శి రహీమ్, మాజీ సర్పంచ్ మొగిలిపల్లి నరసింహారావు మాజీ ఉప సర్పంచ్. కొమరం రాంబాబు. మాజీ ఎంపీటీసీ కాయం శేఖర్. బిజ్జ రమేష్. బిజ్జ రామారావు. రేగా సుదర్శన్. తాటి సందీప్ సోయం సుదర్శన్.కొట్టెం ప్రసాద్.యాలం మల్లయ్య.రేగా సత్యనారాయణ.చింత మత్తయ్య పార్సిక రామారావు. కారం రమేష్. పూనెం శ్రీను. కొమరం రామకృష్ణ. సురపల్లి నవీన్. బాడిశ శ్రీను. తోలేం సాగర్ కాయం రాజేష్ ,సిబ్బంది పోలేబోయిన నాగరాజు,బాడిశ పాపారావు తదితరులు పాల్గొన్నారు.బొడ్రాయి కి ప్రత్యేక పూజలు నిర్వహించి న సర్పంచ్,బీ ఆర్ ఎస్ నాయకులుకొత్తూరు కాలనీ లో కొలువై ఉన్న బొడ్రాయికి నూతన సర్పంచ్ కొట్టెం శోభారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు . గ్రామపంచాయతీ ప్రజలు ఆయుర్ ఆరోగ్యాలతో పాటు, సుభిక్షంగా ఉండాలని గ్రామ దేవతను వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం అమరారం గ్రామపంచాయతీకి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. పలువురు పాలకమండలి సభ్యులు,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# నేడు పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన



**కూసుమంచి, మహా:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు మంత్రి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి కూసుమంచి క్యాంప్ కార్యాలయంకు చేరుకుంటారు. ఉదయం 10గంటలకు కూసుమంచి మండలం గంగబందతండాలోని నూతనంగా మంజూరైన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం నిమిత్తం కేటాయించిన స్థలంను పరిశీలించనున్నారు. అనంతరం కూసుమంచి మండల కేంద్రంలోని నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించనున్నట్లు దయాకర్ రెడ్డి తెలిపారు. అక్కడ నుంచి క్యాంప్ కార్యాలయంకు చేరుకుని పాలేరు నియోజకవర్గ పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ ఇంజనీర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అలాగే రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆక్న తెలిపారు. లంచ్ విరామం అనంతరం మధ్యాహ్నం 3.20గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఉన్న తరుణీహాట్ లో సమీకృత ప్రభుత్వ మండల కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అక్కడే ఖమ్మం రూరల్ మండలానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేయను న్నారు. అనంతరం మధ్యాహ్నం 4.40గంటలకు శ్రీరాం నగర్ లోని నూత నంగా మంజూరైన కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## ఖమ్మం జిల్లా వాసికి దక్కిన అరుదైన గౌరవం



**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది దేవరపల్లి సుబ్రహ్మణ్యంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి నమ్మకాన్ని ఉంచింది. ఖమ్మం జిల్లా న్యాయవాద రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ న్యాయవాది దేవరపల్లి సుబ్రహ్మణ్యంకు కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా మరోసారి అవకాశం లభించింది. మధిర పట్టణానికి చెందిన ఆయనను ఈ పదవిలో తిరిగి కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా నియామకం ద్వారా సుబ్రహ్మణ్యం గారు ఈ కీలకమైన పదవిలో మరో మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు. గతంలో ఆయన నిర్వహించిన బాధ్యతలు మరియు న్యాయపరమైన అంశాలపై ఆయనకు ఉన్న పట్టును పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేసింది.దేవరపల్లి సుబ్రహ్మణ్యం కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా తిరిగి నియామకం కావడం పట్ల జిల్లాలో మరియు ముఖ్యంగా మధిర ప్రాంతంలో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ విషయం తెలిసిన వెంటనే పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రభుత్వ అధికారులు మరియు తోటి న్యాయవాదులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నియామకం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ పరంగా వచ్చే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో మరియు సమర్థవంతంగా వాదనలు వినిపించడంలో సుబ్రహ్మణ్యం కీలక పాత్ర పోషిస్తారని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

# పేదవాడికి సొంత ఇల్లు ఉండడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపనలో ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, మహా :** పేదవాడికి సొంత ఇల్లు ఉంటేనే జీవితం సురక్షితమని, అదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ, కొత్తపల్లి ఉపేంద్రలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే పాయం శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే పేదల కన్నీళ్లు తుడిచేలా, వారి గౌరవాన్ని నిలబెట్టేలా పనిచేస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు పేద కుటుంబాలకు భరోసా మాత్రమే కాకుండా వారి భవిష్యత్తుకు బాట వేసే అడుగని పేర్కొన్నారు. గ్రామగ్రామాన అభివృద్ధి, ప్రతి అర్హుడికి న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. పినపాక నియోజకవర్గంలో ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్న సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.ప్రజల సంక్షేమమే తమ రాజకీయ లక్ష్యమని, మాటలతో కాదు పనులతోనే ప్రజలకు సమాధానం చెబుతామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సైదులు, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు చైతన్య నాయుడు, మండల ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# యువతకు జాబ్ గ్యారెంటీతో ఉచిత స్కిల్ ట్రైనింగ్

## జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎల్ ఎస్ సి లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్ రీడింగ్టన్ ఫౌండేషన్ సహకారంతో జాబ్ గ్యారెంటీతో కూడిన ఉచిత స్కిల్ ట్రైనింగ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లాజిస్టిక్స్ రంగానికి చెందిన వివిధ విభాగాల్లో నైపుణ్య శిక్షణ అందించి శిక్షణ పూర్తయిన అనంతరం 100 శాతం ప్లేస్‌మెంట్‌తో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఈనెల 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎంపిక డ్రైవ్‌లో 29 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా మొత్తం 51 మంది యువతి యువకులు శిక్షణకు హాజరయ్యారని తెలిపారు. మరింత మందికి అవకాశం కల్పించేందుకు ఈనెల 27వ తేదీన ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మరో ప్రత్యేక ఎంపిక డ్రైవ్ నిర్వహించి అదనంగా 50 మంది యువతను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో వేర్‌హౌస్ స్టోర్ కీపర్, సప్లై చైన్ అసోసియేట్, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సులు ఉండగా, 10వ తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి 18 నుంచి 27 సంవత్సరాల వయస్సు ఉన్న యువతి, యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు 13,000 నుంచి 18,000 వరకు జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితమై స్కిల్ ఇండియా సర్టిఫికేషన్ కలిగి ఉండటంతో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కూడా ఉంటాయని జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**పినపాక, మహా:** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరాలను సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ కుటుంబ సభ్యులుప్రతి ఇంటి వద్ద క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసి భక్తి ప్రవర్తలతో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. మండలంలోని పినపాక, తోగ్గుడెం,మారేడు గూడెం,ఏడుల్లా బయ్యారం, జానంపేట, దుగినపల్లి ,ఉప్పాక తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫాస్టర్‌లు కరుణ , ప్రేమ, దాతఅత్వం, త్యాగం, ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహౌన్నత సందేశాలు మానవాళిని సత్యపదం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గ నిర్దేశం చేశారని హితబోధ చేశారు. అనంతరం క్రీస్తు జన్మ ను పాస్టర్లు వివరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.





# క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**మణుగూరు, మహా :** క్రైస్తవుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మణుగూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అశోక్‌నగర్ సీఎస్సీ ఎస్టీ జా చర్చ్, శివలింగాపురం పరిశుద్ధ లూకా దేవాలయంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.క్రిస్మస్ వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యేకు చర్చి పాస్టర్లు, క్రైస్తవ సోదర సోదరీమణులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనల్లో భాగంగా పాస్టర్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగను ప్రజలతో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన పండుగ క్రిస్మస్ అని, ఏసుక్రీస్తు జన్మించిన ఈ శుభ దినాన అందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, నాయకులు గణేష్ రెడ్డి, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వాజపేయి స్మరణలో పరుగులు తీసిన ఖమ్మం

- ఘనంగా అటల్ జీ శతజయంతి వేడుకలు
- ఖమ్మంలో ఉత్సాహంగా సాగిన 2కే రన్
- దేశాభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు వాజపేయి








**ఖమ్మం,మహా:** భారత రాజకీయ యవనికపై చెరగని ముద్ర వేసిన ధ్రువతార, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి 101వ జయంతి (శతజయంతి) ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఖమ్మం నగరం ఘనంగా నివాళులర్పించింది. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలో భారీ 2కే రన్ ర్యాలీని నిర్వహించారు. దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడి ఆశయాలను స్మరిస్తూ, యువతలో స్ఫూర్తిని నింపే లక్ష్యంతో సాగిన ఈ కార్యక్రమం నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది.అటల్ బీహార్ వాజ్పేయి శతజ ఉత్సవ సమితి అధ్యక్షులు దిద్దుకూరు వెంకటేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వేదికగా ప్రారంభమైన ఈ 2కే రన్ ర్యాలీ ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది. ఉదయాన్నే స్టేడియం వద్దకు చేరుకున్న వందలాది మంది యువకులు, విద్యార్థులు, రాజకీయ నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. వాజపేయి చిత్రపటాలతో, జాతీయ జెండాలతో అలంకరించిన ఈ ర్యాలీని ప్రముఖులు జెండా ఊపి ప్రారంభించారు. సర్దార్ పటేల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ రన్ నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ జిల్లా పరిషత్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు,తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, నల్గొండ జిల్లా ఇన్చార్జి మాజీ అధ్యక్షులు ఉదయ ప్రతాప్ తదితరులు వాజ్పేయి సేవలను గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజపేయి కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ఆయన ఒక గొప్ప కవి, దార్శనికుడు, దేశ భక్తుడని కొనియాడారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో దేశం అణుశక్తి రంగంలో, రవాణా రంగంలో సాధించిన ప్రగతి అద్భుతమని వారు గుర్తుచేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించేలా ఆయన చేపట్టిన పథకాలు నేటికీ దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నాయని అభివర్ణించారు.ర్యాలీ సాగినంత పొడవునా "అటల్ జీ అమర్ రహే" అనే నినాదాలతో ఖమ్మం వీధులు మారుమోగాయి. యువత పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వాజపేయి చూపిన క్రమశిక్షణ, దేశభక్తి, నిబద్ధతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, అదే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటల్ బీహార్ వాజ్పేయి రాష్ట్ర సమన్వయ కన్వీనర్ జి.విద్యాసాగర్, సుబ్బారావు,నంబూరు రామలింగేశ్వర రావు, కొత్త వెంకటేశ్వరావు, వీరెల్లి రాజేష్, సరస్వతి, రజినీ రెడ్డి, అనిత, అల్లిక అంజయ్య, జ్వాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అటల్ జీ జయంతి వేడుకలు

**మహా,చర్ల:** భారతీయ జనతా పార్టీ చర్ల మండల కార్యాలయంలో అటల్ జీ (అటల్ బిహారీ వాజ్‌పేయి) జయంతి సందర్భంగా ఆయనకు మండల బీజేపీ నాయకులు పుష్పాంజలి ఘటించారు.ఆ పార్టీ మండల అధ్యక్షులు నూప రమేష్ మాట్లాడుతూ దివంగత ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్పతనాన్ని రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను దూరదృష్టిని కొనియాడుతూ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా చేసిన సేవలు, దేశాభివృద్ధికి చేసిన కృషి, ఆయన ప్రసంగాలలో గొప్పతనం మరువలేనిది అని అన్నారు. భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి నిసుపరిపాలన దినోత్సవం గా నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతదేశానికి మూడు సార్లు ప్రధానమంత్రిగా సేవలందించిన గొప్ప నాయకులు,



వాక్చాతుర్యానికి మారుపేరు, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అని అన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న కాలంలో దేశానికి ఎనలేని సేవ చేశారు. కార్గిల్ యుద్ధంలో దేశాన్ని విజయపథంలో నడిపించడం, పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించడం, సువర్ణ చతుర్భుజ రహదారి వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం వంటివి ఆయన పాలనకు నిదర్శనాలు.ఆయన దూరదృష్టితో కూడిన విధానాలు, అందరినీ కలుపుకొనిపోయే (సబ్ కా సాథ్ సబ్ కా వికాస్) సిద్ధాంతం నేటికీ స్ఫూర్తిదాయకం. ఆయన రాజకీయ జీవితం నిస్వార్థానికి, దేశభక్తికి ప్రతీక.భారతీయ జనతా పార్టీకి మార్గదర్శి: బీజేపీని దేశవ్యాప్తంగా విస్తరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో పార్టీ బలపడి, దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్తారపు రత్తయ్య, గునూరి రమణ, మండల ప్రధాన కార్యదర్శి పొడియం నరసింహ,మండల కార్యదర్శి ముత్తారపు శ్రీనివాస చారి, కార్యదర్శి విశ్వనాధం, చుక్క శివ, సరియం ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ మహిళలకు చీరల పంపిణీ

ఎన్నికల మేనిఫెస్టో మాట నిలబెట్టుకున్న సర్పంచ్ హీరాలాల్

ముఖ్యఅతిదులుగా పాల్గొన్న సీఐ సాగర్, ఎస్సై గోపి



**కారేపల్లి, మహా:** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ లో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్టియన్ మహిళలకు రాందాస్అన్న చీరల కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ కార్యాలయం నందు గ్రామ సర్పంచ్ భానోత్ హిరాలాల్ అధ్యక్షతన క్రిస్టియన్ మహిళలకు క్రిస్మస్ పండుగ సందర్భంగా చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కారేపల్లి సిఐ నూనావత్ సాగర్ , ఎస్సై బైరు గోపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ గ్రామ ప్రజలను క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ క్రిస్మస్ పండుగ యొక్క విశిష్టతను తెలియజేశారు. గ్రామ సర్పంచ్ హిరాలాల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో క్రిస్టియన్ మహిళలకు చీరల పంపిణీ చేస్తానని మాట ఇచ్చానని ఇచ్చిన మాట ప్రకారం హామీని నెరవేర్చానని అలాగే నేను మాటల మనిషి కాదని చేతల మనిషిని భవిష్యత్తులో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తానని గ్రామ అభివృద్ధికి నా సహాయ సహకారాలను అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. అలాగే గ్రామ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమ అనంతరం పాస్టర్ చే ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలను నిర్వహించి లబ్ధిదారులకు చీరల పంపిణీ మరియుక్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ బిక్కులాల్, వార్డు మెంబర్లు , గ్రామపంచాయతీ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోత్ భీముడు, మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్, గుగులోత్ భగవాన్దాస్ , భుక్య సక్రియ , గూగులోత్ బాబు,ధర్మ, రాంబాబు, గుగులోత్ నాగవేణి,మోతిలాల్, నాగేష్, దిలీప్, జరపల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

## అతిధులను సన్మానించిన సర్పంచ్ దంపతులు

చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కారేపల్లి సిఐ నూనావత్ సాగర్, ఎస్సై బైరు గోపీ లను సర్పంచ్ బానోత్ హీరాలాల్ దంపతులు శాలువాలతో సన్మానించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



# మత్తులో మాతృత్వం

- వైరా బస్టాండ్‌లో కన్నీరు పెట్టించిన దృశ్యం
- మద్యం మత్తులో కన్నపేగును మరిచిన వైనం
- వైరా బస్టాండ్‌లో మద్యం మత్తులో చిన్నారులను వదిలేసిన వివాహిత



**ఖమ్మం, మహా:** అమ్మ అంటే ఆప్యాయత.. అమ్మ అంటే రక్షణ.. ఆపదలో ఉన్న బిడ్డకు అమ్మే ధైర్యం. కానీ, వ్యసనం కళ్లు కప్పితే ఆ కన్నతల్లే బిడ్డలకు శాపంగా మారుతుందని నిరూపించింది వైరాలో జరిగిన ఒక దారుణ ఘటన. కన్నబిడ్డల ఆకలి కేకలు, వారి భయం ఆ తల్లికి వినిపించలేదు.. కనిపించలేదు. మద్యం మత్తులో ఆమె మైమరిచి పడిపోగా, ఆ పసిప్రాణాలు నడిరోడ్డుపై అభాగ్యులుగా మిగిలిపోయిన తీరు చూసి స్థానికులు కన్నీరు పెట్టారు.ఖమ్మం జిల్లా వైరా పట్టణంలో గురువారం నాడు చోటుచేసుకున్న ఓ ఘటన మానవత్వాన్ని ప్రశ్నించేలా ఉంది. నిత్యం రద్దీగా ఉండే వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక వివాహిత తన ఇద్దరు పసిబిడ్డలతో కలిసి కనిపించింది. అయితే, చూస్తుండగానే ఆమె మద్యం మత్తులో తూగుతూ అక్కడే అపస్మారక స్థితిలో పడిపోయింది. తన చుట్టూ ఏం జరుగుతోంది, తన వెంట ఉన్న చిన్నారి బిడ్డల పరిస్థితి ఏమిటి అనే కనీస స్పృహ లేకుండా ఆమె మద్యం మత్తులో మునిగిపోయింది. ఆ సమయంలో అక్కడ కనిపించిన దృశ్యాలు ప్రయాణికుల హృదయాలను ద్రవింపజేశాయి.ఆమె వెంట ఉన్న ఇద్దరు చిన్నారులలో ఒకరు తన తల్లిని లేపేందుకు ప్రయత్నిస్తూ ఏడవడం, మరొకరు ఏమీ తెలియక వాహనాలు తిరిగే ఆ రోడ్డుపైనే అటు ఇటు తిరుగుతూ కనిపించడం అందరినీ కలచివేసింది. ఆకలితో, భయంతో ఆ పసిబిడ్డలు పెడుతున్న కేకలు బస్టాండ్ అంతా ప్రతిధ్వనించాయి. మద్యం మత్తులో ఉన్న ఆ తల్లిని స్థానికులు నిలదీసినా, ఆమె కనీసం స్పందించలేని స్థితిలో ఉండటం గమనార్హం. తల్లి మత్తులో మైమరిచిపోవడంతో, ఆ చిన్నారులు వాహనాల కింద పడతారేమో అన్న ఆందోళనతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆ మహిళను అదుపులోకి తీసుకున్నారు. తక్షణమే ఆ ఇద్దరు పసిబిడ్డలను సురక్షిత ప్రాంతానికి తరలించి వారికి రక్షణ కల్పించారు. అనంతరం ఆమె వివరాలను సేకరించగా, కృష్ణా జిల్లా వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన యువతిగా గుర్తించారు. బహుశా కుటుంబ గొడవలు లేదా ఇతర వ్యక్తిగత కారణాలతో ఆమె వ్యసనానికి బానిసై ఇలాంటి దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఏది ఏమైనా, మాతృత్వపు విలువను దిగజార్చేలా, పసిపిల్లల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేలా సాగిన ఈ ఘటన స్థానికులలో తీవ్ర ఆగ్రహాన్ని, ఆవేదనను నింపింది.



# అటల్ జీ ఆశయాల బాటలో నవ భారతం

- భారత రాజకీయ యవనికపై అజాతశత్రువు అటల్
- కార్యకర్తలే పార్టీకి ప్రాణం.. అటల్ స్ఫూర్తితో ప్రజాక్షేత్రంలోకి వెళ్లండి
- భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల కో ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి



**ఖమ్మం , మహా:** భారత రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నడుం బిగించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, కర్ణాటకతమిళనాడు రాష్ట్రాల కోఇన్చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా గురువారం ఖమ్మం జిల్లాలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన భారీ కార్యకర్తల సమావేశంతో పాటు, జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షుడు జరిగిన కార్యక్రమంలో అటల్ జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, ఆయన చేసిన ప్రసంగం కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది.ఈ సందర్భంగా పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, అటల్ బిహారీ వాజ్‌పేయి కేవలం ఒక పార్టీకి సంబంధించిన నాయకుడు మాత్రమే కాదని, ప్రపంచ దేశాల ముందు భారతదేశం తల ఎత్తుకునేలా చేసిన యుగపురుషుడని కొనియాడారు. 1998లో పోఖ్రాన్ అణు పరీక్షల ద్వారా అగ్రరాజ్యాల ఆంక్షలను ధిక్కరించి భారతదేశాన్ని అణుశక్తి సంపన్న దేశంగా మార్చిన ధీశాలి అటల్ జీ అని ఆయన గుర్తుచేశారు. ఒక పక్క పొరుగు దేశాలతో శాంతిని కోరుతూనే, మరోపక్క కార్గిల్ యుద్ధంలో శత్రువుల వెన్ను విరిచిన అపర చాణక్యుడు వాజ్‌పేయి అని ఆయన అభివర్ణించారు. దేశ ప్రగతికి దిక్సూచిగా నిలిచిన స్వర్ణ చతుర్భుజి రహదారుల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా విప్లవాన్ని తెచ్చిన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన వంటి పథకాలు అటల్ జీ దార్శనికతకు నిదర్శనాలని ఆయన ఉద్ఘాటించారు.వాజ్‌పేయి పునాది వేసిన 'అంత్యోదయ' సిద్ధాంతమే నేడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి మార్గదర్శకంగా నిలుస్తోందని పొంగులేటి పేర్కొన్నారు. పేదలకు గూడు, విద్య,



వైద్యం అందాలన్న అటల్ జీ కలలను సాకారం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన వివరించారు. సిద్ధాంతాల కోసం రాజీ పడని రాజనీతిజ్ఞుడు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన అజాతశత్రువు వాజ్‌పేయి అని, ఆయన నడక, నడత ప్రతి రాజకీయ నాయకుడికి పాఠ్యపుస్తకమని ప్రశంసించారు. విపక్ష నాయకులు సైతం ఆయన ప్రసంగాలను మౌనంగా వినేవారని, అంతటి గొప్ప వక్తృత్వ చాతుర్యం ఆయన సొంతమని పొంగులేటి గుర్తుచేసుకున్నారు.ఖమ్మం జిల్లాలో పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేస్తూ, కార్యకర్తలు అటల్ జీ స్ఫూర్తితో ప్రతి గడపకూ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న శక్తులపై పోరాడాలని, రాబోయే రోజుల్లో ఖమ్మం జిల్లాలో బీజేపీ జెండా రెపరెపలాడడమే అటల్ జీకి ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోతెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, నల్గొండ జిల్లా ఇన్చార్జి మాజీ అధ్యక్షులు ఉదయ ప్రతాప్, అటల్ బీహార్ వాజ్పేయి రాష్ట్ర సమన్వయ కన్వీనర్ జి.విద్యాసాగర్, సుబ్బారావు,నంబూరు రామలింగేశ్వర రావు, కొత్త వెంకటేశ్వరావు,అటల్ బీహార్ వాజ్పేయి శతజ ఉత్సవ సమితి అధ్యక్షులు దిద్దుకూరు వెంకటేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, వీరెల్లి రాజేష్, సరస్వతి, రజినీ రెడ్డి,అనిత, అల్లిక అంజయ్య, జ్వాల,తదితరులు పాల్గొన్నారు.





మహా పత్రిక
ANN తెలుగు




# అన్నారుగూడెం సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఘన సన్మానం

**తల్లాడ, మహా:** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన తిగుళ్ల కేశవులు మరియు జానీ కుటుంబాలు తిరువూరు మండల కేంద్రంలో వివిధ వ్యాపారాలతో స్థిరపడ్డారు. వారి స్వంత గ్రామం అన్నారుగూడెంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వరరావులను వారి గృహాలకు తమ ఆత్మీయ నాయకులను సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం మిఠాయిలు పంచి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అన్నారుగూడెం గ్రామానికి ప్రాతినిధ్యం వహిస్తూ వ్యూహాత్మకమైన శైలితో పంచాయతీని కైవసం చేసుకున్న గ్రామ నిర్దేశికుడు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావును అభినందిస్తూ సీనియర్ నాయకులు రాజకీయాల్లో అపారమైన అనుభవం కలిగిన నాయకులు మన ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వరరావు సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని కోరుతూ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వరరావు, నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు,మారెళ్ళ దేవేందర్,తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, లక్ష్మణ్,కేశవులు,జానీ కుటుంబ సభ్యులు ఉన్నారు.

# తల్లాడ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు ఘన సన్మానం

**తల్లాడ, మహా:** తల్లాడ మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ ఉపసర్పంచ్, వార్డు మెంబర్స్ కి టీడీపి వీరబిమని కొమ్మినేని రామయ్య వారి గృహానికి తమ ఆత్మీయ గ్రామ పంచాయితీ సర్పంచ్ పెరిక.నాగేశ్వర రావు (చిన్నబ్బాయి), ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి,మరియు వార్డు సభ్యులను, ముఖ్య నాయకులని సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథులుగా మండల నాయకులు ధూపాటి భద్రరాజు, కూచిపూడి వెంకటేశ్వరరావు, సరికొండ శ్రీనివాసరాజు, కొమ్మినేని వెంకటేశ్వర్లు, కేతినేని చలపతిరావు,వారిని కుడా సన్మానించి అభినందించారు.తదనంతరంమిఠాయిలు పంచి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక. నాగేశ్వర రావు మాట్లాడుతూ తల్లాడ లో బి ఆర్ యస్ పార్టీ కి తెలుగదేశం పార్టీ మద్దతు తెలపడం వాళ్ళ ఈరోజు నాకు ఇంత మెజారిటీ నా విజయం చేకూరింది అని నా విజయానికి సహకరించిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు(చిన్నబ్బాయి), ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి,టీడీపి మండల నాయకులు ధూపాటి భద్రరాజు, సరికొండ శ్రీనివాసరాజు, కూచిపూడి వెంకటేశ్వరరావు, అన్నారుగూడెం ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వరరావు, అంజనాపురం ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు, వార్డు మెంబర్లు పెరిక.శ్రీలేఖ, పెరిక. స్వర్ణ లత,షేక్.కమల్, ముకర.దో నే ష్, వెమిరెడ్డి.చిన్న క్రిష్ణ రెడ్డి,గుంటుపల్లి. కుమారి,టీడీపి నాయకులు మొక్క. కృష్ణార్జున్, నారపోగు.ప్రసాద్, ఎండి హఫీజ్, కోమ్మినేని రాము, రావూరి రవిప్రసాద్, తుమ్మలపల్లి రామారావు, పెరిక కిట్టు, మొక్క.సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.



# తనికెళ్ళలో ఘనంగా వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు

* భారీ బైక్ ర్యాలీ.. వాజ్‌పేయికి ఘన నివాళులు
* దేశాభివృద్ధిలో అటల్ జీ కృషి చిరస్మరణీయం
* బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**కొణిజర్ల, మహా:** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ళ గ్రామంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను భారతీయ జనతా పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. మండల అధ్యక్షులు కవిడె మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోబిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెల్లూరుకి కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వాజ్‌పేయి శతజయంతిని ఘనంగా నిర్వహించాలని తీసుకున్న నిర్ణయానికి ప్రధానమంత్రి మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఒక్క సీటు కోసం విలువలను తాకట్టు పెట్టని వ్యక్తిత్వం వాజ్‌పేయిదని, ఆయన క్రమశిక్షణే నేడు బీజేపీని దేశంలోనే తిరుగులేని శక్తిగా మార్చిందని నాయకులు కొనియాడారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో చేపట్టిన రోడ్డు నిర్మాణాలు కేవలం వాహనాల కోసమే కాకుండా, దేశ ప్రజల హృదయాలను కలపడానికి దోహదపడ్డాయని వారు గుర్తు చేశారు. భారతీయ సంస్కృతిని, హిందూ ధర్మాన్ని కాపాడటంలో ఆయన చూపిన చొరవను కొనియాడుతూ, విదేశీ దాడుల నుండి మన సంప్రదాయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. అనంతరం నెల్లూరి కోటేశ్వరరావు బైక్ ర్యాలీని ప్రారంభించక గ్రామంలోని అన్ని వీధిలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. దారిపొడున నినాదాలు చేస్తూ కార్యకర్తలు ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు బండారు నరేష్, ఉత్పత్తి మల్లికార్జున్, కవిడ రాంబాబు, యాస సత్యనారాయణ, పొట్లపల్లి నాగార్జున , రోంటే కృష్ణ, రోంటే మధు,పెద్దప్రోలు నాగేశ్వరావు, రోంటే ప్రసాద్, చెన్న ప్రసాద్, యాస రాజేష్ తదితరులు పాల్గొన్నారు





Follow: @ANNTELUGU
26-12-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు




# ఖమ్మంలో ఎన్ఐఏ ప్రకంపనలు

* బండి సంజయ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన దర్యాప్తు సంస్థ!
* విద్యావేత్తల ఇళ్లలో ఎన్ఐఏ సోదాలు.
* పాలస్తీనా నిరసనలే కొంపముంచాయా?
* ఖమ్మంలో ఉగ్రకోణంపై ఎన్ఐఏ ఆరా!
* విద్యా సంస్థల ముసుగులో విదేశీ లింకులు?

**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం జిల్లా కేంద్రంలో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు మెరుపు దాడులు నిర్వహించడం కలకలం రేపింది. ముఖ్యంగా విద్యా రంగానికి చెందిన కొందరు కీలక వ్యక్తుల నివాసాల్లో ఈ సోదాలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు అందిన ఫిర్యాదుల మేరకు, ఉగ్రవాద లేదా నిషేధిత సంస్థల సంబంధాలపై ఆరా తీసేందుకు ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది*ఖమ్మం నగరంలో ఎన్ఐఏ అధికారులు చేపట్టిన తనిఖీలు స్థానికంగా పెను దుమారం రేపుతున్నాయి. నగరంలోని ఇద్దరు ప్రముఖ విద్యావేత్తల ఇళ్లలో, అలాగే వారి బంధువుల నివాసాల్లో ఆరుగురు సభ్యులతో కూడిన ఎన్ఐఏ బృందం ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. కొద్ది నెలల క్రితం పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ ఖమ్మంలో భారీ ప్రదర్శనలు జరిగాయి. అయితే, ఈ ప్రదర్శనలలో సదరు విద్యా సంస్థల యజమానులు తమ విద్యార్థులతో కలిసి పాల్గొనడంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ విషయాన్ని స్థానిక బీజేపీ నేతలు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకువెళ్లారు.ఈ నిరసనల వెనుక ఏవైనా అరాచక శక్తుల ప్రోద్బలం ఉందా, లేదా విదేశీ ఉగ్రవాద సంస్థలతో వీరికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో బండి సంజయ్ కేంద్ర హోంశాఖను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు ప్రాథమిక ఆధారాలు సేకరించిన ఎన్ఐఏ, తాజాగా రంగంలోకి దిగి లోతైన విచారణ చేపట్టింది. సోదాల్లో భాగంగా పలు కీలక పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా నిషేధిత మావోయిస్టు సంస్థలు లేదా ఇతర ఉగ్రవాద గ్రూపులతో వీరికి ఆర్థిక లావాదేవీలు ఉన్నాయా అన్న అంశంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ తనిఖీలు కేవలం నిరసనలకే పరిమితం కాకుండా, విద్యా సంస్థల ముసుగులో యువతను తప్పుదోవ పట్టించే చర్యలు ఏవైనా జరుగుతున్నాయా అనే కోణంలోనూ సాగుతున్నాయి. బండి సంజయ్ జోక్యంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేంద్ర వర్గాలు స్పష్టం చేస్తుండగా, ఈ రైడ్స్ ఖమ్మం రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి. రానున్న రోజుల్లో ఈ సోదాలకు సంబంధించి మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఆగపేట పంచాయతీ కార్యాలయానికి మురళి కుర్చీలు వితరణ

## అభినందించిన సర్పంచ్ కొత్త యాకన్న


**దంతాలపల్లి, మహా:** మండల పరిధిలోనిఆగపేట గ్రామ పంచాయతీ కార్యాలయానికి కీ.శే. కోమటి రామయ్య జ్ఞాపకార్థంగా వారి మనవడు దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి మురళి 6 కుర్చీలు , ఒక ట్రాక్టర్ ఇసుకను విరాళంగా అందజేశారు. ఇదే కాకుండా మరో 14 కుర్చీలు త్వరలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా అగపేట సర్పంచ్ కొత్త యాకయ్య దాత కోమటి మురళి ని అభినందించారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి కి మరింత మంది దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోవార్డు మెంబర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



# దండకారణ్యంలో 'ఎర్ర' కోట కూలింది

* ఒడిశా పోలీసుల మెరుపు దాడిలో గణేష్ ఉయికే హతం!
* నల్లగొండ టు నక్సల్బరీ.. ముగిసిన నాలుగు దశాబ్దాల సాయుధ ప్రస్థానం
* కోటి పది లక్షల రివార్డు.. సెంట్రల్ కమిటీ సభ్యుడు
* ఒక్క తూటాతో మావోయిస్టు సామ్రాజ్యం అతలాకుతలం!
* చక్రపాడ అడవుల్లో నెత్తురోడిన తెల్లవారుజాము.. బలగాల పంజాకు అగ్రనేత బలి
* ముగిసిన 'జీరమ్ ఘాటీ' సూత్రధారి కథ..
* మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ

**ఖమ్మం బ్యూరో, మహా:** దండకారణ్యం మరోసారి తూటాల గర్జనతో వణికిపోయింది. దశాబ్దాలుగా పోలీసు యంత్రాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తూ, గెరిల్లా యుద్ధతంత్రంతో అడవిని శాసించిన మావోయిస్టు అగ్రనేత పాకా హనుమంతు అలియాస్ గణేష్ ఉయికే ప్రస్థానం ముగిసింది. ఒడిశాలోని కంధమాల్ అడవుల్లో బుధవారం అర్ధరాత్రి దాటాక జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో భద్రతా దళాలు మావోయిస్టు కోటను బద్దలు కొట్టాయి. ఈ ఆపరేషన్‌లో గణేష్‌తో పాటు మరో ఐదుగురు కీలక నేతలు హతమవ్వడం, ఉద్యమ చరిత్రలోనే అతిపెద్ద దెబ్బగా నిఘా వర్గాలు భావిస్తున్నాయి.



## అర్ధరాత్రి ఆపరేషన్.. గర్జించిన తుపాకులు

కంధమాల్‌గంజాం జిల్లాల సరిహద్దుల్లోని దట్టమైన చక్రపాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు అగ్ర నాయకత్వం కీలక సమావేశం నిర్వహిస్తోందన్న పక్కా సమాచారంతో పోలీసులు వ్యూహం రచించారు. రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన అత్యంత శిక్షణ పొందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ బలగాలు ఏకకాలంలో అడవిని నాలుగు వైపుల నుండి చుట్టుముట్టాయి. పొగమంచు కురుస్తున్న వేళ, చీకటిని చీల్చుకుంటూ బలగాలు ముందుకు సాగాయి. పోలీసుల ఉనికిని గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించడంతో యుద్ధ వాతావరణం నెలకొంది. తెల్లవారుజాము వరకు సాగిన ఈ హోరాహోరీ పోరులో, చివరకు పోలీసుల వ్యూహం ఫలించింది. గణేష్ ఉయికే మృతదేహంతో పాటు అత్యాధునిక ఆయుధాలు అక్కడ లభ్యమవ్వడం ఆపరేషన్ విజయాన్ని చాటిచెప్పింది.

## నల్లగొండ నుంచి అగ్రనేత వరకు..

హతమైన పాకా హనుమంతు ప్రస్థానం అత్యంత ఆసక్తికరం. తెలంగాణలోని నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో పుట్టిన హనుమంతు, సుమారు 40 ఏళ్ల క్రితం విప్లవ భావజాలంతో అడవి బాట పట్టారు. పీపుల్స్ వార్ కాలం నుంచి నేటి మావోయిస్టు పార్టీ వరకు ఆయన ఎదిగిన తీరు అసాధారణం. పార్టీలో అత్యున్నత నిర్ణాయక విభాగమైన సెంట్రల్ కమిటీకి చేరుకున్న ఆయనపై ప్రభుత్వం కోటి పది లక్షల రూపాయల భారీ రివార్డును ప్రకటించింది. ముఖ్యంగా 2013లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భీకర 'జీరమ్ ఘాటీ' మారణకాండకు ఈయనే ప్రధాన సూత్రధారి అని రికార్డులు చెబుతున్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పార్టీ విస్తరణకు హనుమంతు వెన్నుముకగా నిలిచారు.

## అంతానికి చేరువలో ఎర్ర సైన్యం?

ఈ ఎన్‌కౌంటర్ కేవలం ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదు, మావోయిస్టు పార్టీకి ఒక మేధో సంపత్తిని కోల్పోవడం వంటిదని విశ్లేషకులు అంటున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన '2026 నాటికి నక్సలిజం రహిత భారత్' లక్ష్యానికి ఈ ఆపరేషన్ పెద్ద ఊతాన్ని ఇచ్చింది. వరుస ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల మరణాలతో ఇప్పటికే దండకారణ్యంలో మావోయిస్టుల పట్టు సడలుతోంది. తాజాగా హనుమంతు వంటి వ్యూహకర్తను కోల్పోవడంతో పార్టీ క్యాడర్‌లో నైతిక స్థైర్యం దెబ్బతినే అవకాశం ఉంది. ప్రస్తుతం అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేయగా, సరిహద్దు రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించారు.